చెత్తపన్ను అక్రమ వసూళ్లపై విచారణ చేయాలి

– వైఎస్సార్‌టీయూసీ నాయకుల డిమాండ్
– మద్దతు పలికిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్: చెత్త పన్ను అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేయాలని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, కడప నియోజకవర్గ అధ్యక్షుడు ఏ1 నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా జాషువా, నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెత్త పన్ను వసూలు చేయవద్దని ఆదేశాలు ఇచ్చారని, కానీ కడప కార్పొరేషన్‌లో కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై హోటళ్లు, రెస్టారెంట్లు, కళ్యాణ మండపాలు, అపార్ట్‌మెంట్లు, షాపుల నుంచి చెత్త పన్ను అక్రమంగా వసూలు చేశారన్నారు. కొన్ని మాసాల పాటు సుమారు రూ.8కోట్ల వరకూ వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేసి ఎవరి ఆదేశాల మేరకు ఈ చెత్త పన్ను వసూలు చేశారు, ఎవరెవరికి ఎంతెంత చెల్లించారనే విషయాలను నిగ్గుతేల్చాలన్నారు. ఇందులో ఎంహెచ్‌ఓను సరెండర్ చేసి, కింది స్థాయి సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ కుమార్ మాట్లాడుతూ అడిషనల్ కమిషనర్ ఆధ్వర్యంలోనే ఈ చెత్త పన్ను అక్రమ వసూళ్లు జరిగాయని, ఆయన్ను విధుల నుంచి తప్పించి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య మాట్లాడుతూ నగరపాలక కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులంతా అధికార పార్టీకి తొత్తులుగా పనిచేస్తూ నగరపాలనను గాలికొదిలేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, చెన్నయ్య, షంషీర్, కె. బాబు, పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, ఐస్‌క్రీం రవి, బసవరాజు, కిరణ్, సుదర్శన్ ,సీహెచ్ వినోద్,పి. సంపత్‌కుమార్, కంచుపాటి బాబు, మునిశేఖర్‌రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, బి. మరియలు, నారాయణమ్మ, సుజిత, మల్లీశ్వరి,శ్రీదేవి, పద్మ పాల్గొన్నారు.


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్పొరేషన్‌లో అవినీతిని నిగ్గుతేల్చాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో జరుగుతున్న చెత్త పన్ను వసూలు, కుక్కల ఆపరేషన్, ఫుట్ పాత్ వసూళ్లపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇంటి నుండి వసూలు చేసే చెత్త పన్నులు రద్దు చేసిందని, కానీ అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, వస్త్ర పరిశ్రమలు లాంటి వాణిజ్య, వ్యాపార సంస్థల నుండి వసూలు చేస్తున్న చెత్త పన్ను వసూళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగిందన్నారు. ఈ అవినీతిలో దాదాపు 30 మంది శానిటరీ సెక్రెటరీలు, ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకంగా ఉందన్నారు. అవినీతిని ప్రోత్సహించిన వ్యక్తులపై కూడా చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, కె. శ్రీనివాసులరెడ్డి, నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

క్లుప్తంగా

గ్రీవెన్స్ రద్దు చెప్పడం మరిచారు

కడప కార్పొరేషన్: జిల్లా పరిషత్ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం కడప నగర పాలక సంస్థలో జరిగే ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ను రద్దు చేశారు. అయితే ఈ విషయాన్ని ముందస్తుగా ప్రకటించకపోవడంతో చాలామంది ప్రజలు సోమవారం అర్జీలు ఇవ్వడానికి కార్పొరేషన్‌కు వచ్చారు. అయితే గ్రీవెన్స్ స్వీకరించే కాన్ఫరెన్స్‌హాలుకు తాళం వేసి ఉండటంతో నిరాశగా వెనుదిరిగారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 21వ తేదీ జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆర్ఎంపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల రమణయ్య కోరారు. సోమవారం రవీంద్ర నగర్ రెవల్యూషనరీ మార్క్సిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్ఎంపీఐ) కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా గుజ్జుల రమణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో దళితులను ఆదివాసుల్ని చంపడం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ పార్టీ నాయకులు అబ్దుల్ ఆలం, నాగరాజు, ప్రతిభా భారతి, రమేష్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, కేవీపీఎస్ నగర కార్యదర్శి నరసింహులు కోరారు. సోమవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. తాము అధికారంలోకి వస్తే ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వమ్ము చేసిందని విమర్శించారు. నిరుద్యోగుల ద్వారా దరఖాస్తులు స్వీకరించి బ్యాంకుల ద్వారా ఇంటర్వ్యూలు పూర్తి చేశారని, కానీ ఇప్పటివరకు అర్హుల జాబితా విడుదల చేయలేదని పేర్కొన్నారు. కార్పొరేషన్ల నిధులను ఇతర కార్యక్రమాలకు వాడటం తగదన్నారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికైనా రుణాలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ముగ్గురు అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో భగత్‌సింగ్ నగర్ కాలనీలో వున్న రాజ్‌కుమార్‌పై మనస్పర్థలతో జులై 28న అతని ఇంటిలోకి జొరబడి సంపత్, గణేష్, శివలు దాడి చేశారు. ఇంటిలోని వస్తువులన్నీ చిందరవందర చేశారు. ఈ సంఘటనలో నిందితులైన ముగ్గురిని ఎస్ఐ తులసీనాగప్రసాద్ తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేశారు.

కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి


బీసీడబ్ల్యుఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆర్ఎస్‌యూ నగర అధ్యక్షుడు గురుమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని బీసీ డబ్ల్యు ఓ కార్యాలయం ఎదుట ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల కాకపోవడం వలన స్థానికంగా ఉన్న వార్డెన్లు మెనూ ప్రకారం ఆహారం విద్యార్థులకు అందించలేకపోతున్నారని అన్నారు. ప్రతి వసతి గృహంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలన్నారు. బాత్రూమ్స్, మరుగుదొడ్ల మెయింటెనెన్స్ కు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి నెల విద్యార్థులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య పాల్గొన్నారు.

కడపలో ‘తారాస్’ సందడి


తారాస్ కేఫ్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ అనన్య నాగళ్ల తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో సినీనటులు సందడి చేశారు. ఇక్కడి ఎర్రముక్కపల్లెలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ‘తారాస్ కేఫ్ స్టోరీస్’ ప్రారంభోత్సవానికి పుష్ప–2 ఫేమ్ గగన్ విహారి, హీరోయిన్ అనన్య నాగళ్ల, కొరియోగ్రాఫర్ కార్తీక్ మహరాజ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వీరితోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. సినీనటులను చూడటానికి అధిక సంఖ్యలో వచ్చిన యువతీ, యువకులతో కేఫ్ కిక్కిరిసిపోయింది. కేఫ్ ప్రొప్రైటర్ ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడారు.

రాజీవ్ పార్కు స్టాల్స్ బాడుగ వసూళ్లలో అవకతవకలు

కడప కార్పొరేషన్: కడప నగరంలో రాజీవ్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ నుంచి బాడుగ వసూలు చేయడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు నెలకు రూ.10,500 వసూలు చేయాలని, తోపుడుబండికి నెలకు రూ.6,500 వసూలు చేయాలన్నారు. స్టాల్స్, తోపుడు బండ్లు కలిసి 46 దాకా ఉన్నాయన్నారు. ఈ లెక్కన నెలకు రూ.3.50లక్షల వరకూ ఆదాయం రావాల్సి ఉండగా, నెలకు రూ.90వేలు, రూ.80వేలకు మించి వసూలు కావడం లేదన్నారు. దీనివల్ల కార్పొరేషన్‌కు చాలా నష్టం జరుగుతోందన్నారు. రెండు, మూడు నెలలు చూసిన తర్వాత, నోటీసులిచ్చి బాడుగ చెల్లించనివారి స్టాల్స్, తోపుడు బండ్లు తొలగించాల్సిన నగరపాలక అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇందులో చాలా అవకతవకలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవంగా కార్పొరేషన్‌కు ఎంత ఆదాయం రావాలి, ఎంత వచ్చింది... వ్యత్యాసం ఉంటే ఎందుకు అలా జరిగిందని విచారణ చేయాల్సిన అవసరముందన్నారు. లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ తరుపున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమావేశం


మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: కడప కోర్టులో ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్చార్జి చైర్మన్, ఇన్‌ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శాంతి సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ న్యాయ సేవా సదన్‌లో ‘లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్’ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ‘లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు, పరిష్కారం మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు ఎమ్ శాంత, ఎస్.చంద్రకాంతమ్మ, ఎం.వినయ్ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ పి.మనోహర్, ఎం.సౌజన్య, ఎన్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఏ.ఎస్.రవితేజ పాల్గొన్నారు.

విద్యా స్వేచ్ఛను హరించే జీఓను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: విద్యాసంస్థల్లోకి పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా, ఎవరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని అఖిలభారతం ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి సిపి నాగేంద్రకుమార్ అన్నారు. ఈ నూతన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడును కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

రూ. లక్ష విరాళం

పులివెందుల : మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠంలో ఉన్న పత్రా నాయుళ్ల అన్నదాన సత్రానికి సోమవారం పులివెందుల మున్సిపల్ కౌన్సిలర్ సోకే వెంకట రమణ (కోడి రమణ) లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు వస్తుంటారని, అటువంటివారి ఆకలి తీర్చడ పుణ్యకార్యమని చెప్పారు.

పులివెందులకు, చంద్రబాబు నీచత్వానికి పోటీ!

- వైఎస్ కుటుంబం పట్ల అపారమైన ప్రేమాభిమానాలు ఇక్కడి ప్రజల స్వంతం
- ఏడాది కాలం జెడ్పీటీసీ కోసం పైరవీలు, దందాలు, ప్రలోభాలకు దిగారు
- టీడీపీకి ప్రజామద్దతు లేకపోయినా దాంబికాల వెనుక అధికార దుర్వినియోగం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

పులివెందుల: వైఎస్సార్‌సీపీ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలు పులివెందులకు, చంద్రబాబు నీచత్వానికి మధ్య పోటీ అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందులలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మండలానికి సంబంధించిన జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక రకాలైన మాటలు వినిపిస్తున్నాయని, ఫలితం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నది ఒక్కటేనని, 1978లో రాజకీయాలను వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారని, రెండేళ్లు ఆగితే 50ఏళ్లు పూర్తవుతుందని.. గడిచిన 50ఏళ్ల కాలంలో వైఎస్ రాజశేఖరరెడ్డి కానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కానీ, వారి కుటుంబం కానీ, వారికి కేటాయించిన గుర్తుపైన పోటీ చేసిన ఏ ఎన్నికలలో కూడా ఇంతవరకు ఓటమి పొందలేదన్నారు. ఈ గొప్పతనానికి కారణం తనకు తెలిసినంతవరకు రెండేనని.. ఒకటి ఈ పులివెందుల తాలుకా ప్రజలు, కార్యకర్తలు, నాయకులు... రెండవది రాజశేఖరరెడ్డి అన్న మంచితనం, తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి మంచితనం, నాయకత్వం. ఈ తాలుకాను ఒక తాలుకాలా కాకుండా తమ ఇళ్లలా చూసుకున్నారని, వారి సొంత ఇళ్లు పులివెందుల తాలుకాలో అయితే.. వారి ఇల్లు ఇది అని, తాలుకా ప్రజలంటే వారి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు.. నాయకులంటే వారి తోడబుట్టువుల మాదిరి సమానంగా చూసుకున్నారన్నారు. అందుకే ఈ తాలుకా 40ఏళ్ల క్రితం ఏ విధంగా ఉంది, రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రులు అయిన తర్వాత ఎంత అభివృద్ధి చెందిందనేది ఒక్కసారి గమనించగలిగితే స్పష్టమైన తేడా కనిపిస్తుందన్నారు.

మానవత్వం మరిచి విపరీతమైన తాపత్రయం

నియోజకవర్గస్థాయిలో జరిగే ఎన్నిక కాదు ఇది, ఒక మండలానికి జరిగే ఎన్నిక అని.. పులివెందుల రూరల్ జెడ్పీటీసీ ఎన్నిక, అది కూడా ఉప ఎన్నిక, పట్టుమని 12నెలల పదవీ కాలమన్నారు. గతంలో జెడ్పీటీసీగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేశ్వరరెడ్డి ప్రమాదవశాత్తు అకాల మరణం పొందడంతో ఉప ఎన్నికలు వచ్చాయన్నారు. అయితే సంప్రదాయం ప్రకారం పెద్ద, పెద్ద ఎన్నికలకు కూడా ఏ రాజకీయ పార్టీ పోటీ పెట్టదని, కానీ ఈరోజు ఆ పరిస్థితికి తిలోదకాలిచ్చారన్నారు. వారు పోటీచేయడాన్ని తాము కాదనడంలేదని, పోటీ చేసిన తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా గెలవడానికి ప్రయత్నం చేయాలన్నారు. మానవత్వం మరిచి విపరీతమైన అధికార దుర్వినియోగం చేస్తూ తాపత్రయపడటమే అభ్యంతరకరమన్నారు.

నామమాత్రపు బలంతో విర్రవీగుతున్నారు

టీడీపీ బలం ఇక్కడ నామమాత్రమేనని, సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల రూరల్ మండలానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ బలమైన మెజారిటీ సాధించిందని రాచమల్లు అన్నారు. అయినా ఇపుడు జెడ్పీటీసీ ఎన్నికకు టీడీపీ పోటీ చేసి గెలవబోతున్నామని దాంబికాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో పులివెందుల తాలుకాకు సంబంధించిన ప్రజల్లాంటి గొప్ప వ్యక్తిత్వం కలిగిన మనుషులు ఏ తాలుకాలో లేరని గట్టిగా చెబుతున్నానన్నారు. ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా వారు ప్రేమించే నాయకులను గెలిపిస్తూనే ఉండటం ఇందుకు నిదర్శనమన్నారు. అయితే టీడీపీ మాత్రం ధనాన్ని, పోలీసులను నమ్మి పోటీ చేస్తోందన్నారు. డబ్బుతో నాయకులను కొనుగోలు చేయ డం, పోలీసులతో వైఎస్సార్ సీపీ శ్రేణులను బైండోవర్ కేసుల పేరుతో సతాయించడం, కౌన్సిలింగ్‌లు ఇచ్చే పేరుతో స్టేషన్లలో అర్ధ రాత్రి వరకు కూర్చొబెట్టడం, ఒకట్రెండు కేసులు ఉండేవారికి రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని బెదిరించే కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అయితే ప్రజాస్వామ్యబద్ధంగా ఈ ఎన్నికలు జరిగితే 3వేల నుంచి 4వేల ఓట్లతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుస్తుందన్నారు. నిజంగా మీది మంచి పాలన అయితే ఏడాది కాలంలో ఏమేం చేశారో పల్లెలకు వెళ్లి చెప్పి గెలిచే ప్రయత్నం చేయాలి తప్ప ధనాన్ని నమ్ముకుని, పోలీసులను నమ్ముకుని కాదన్నారు.

చీలికలు అనేవి వేర్వేరు ప్రశ్నలు

వైఎస్ కుటుంబం చీలిపోయిందని, ప్రజలలో బేధాభిప్రయాలు వచ్చాయని విలేకరులు అడగగా... ఇవి రెండూ వేర్వేరు ప్రశ్నలని రాచమల్లు అన్నారు. గతంలో ఉన్న వైఎస్ కుటుంబం, ఇప్పుడు వైఎస్ కుటుంబంలో చీలికలు వచ్చాయని విలేకరులు మళ్లీ ప్రశ్నించగా, ఎవరు విడిపోయినారు అవినాష్‌రెడ్డి అలాగే ఉన్నారు, మనోహర్‌రెడ్డి అలాగే ఉన్నారు, భాస్కర్‌రెడ్డి అట్లే ఉన్నారు, జార్జిరెడ్డి అలాగే ఉన్నారని, ఒక్క షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీలోకి పోయిందన్నారు. అట్లా చెప్పుకుంటే చంద్రబాబు ఇంట్లోనే రెండు పార్టీలు ఉన్నాయి, వదినమ్మ ఒక పార్టీలో ఉంది, జూనియర్ ఎన్‌టీఆర్ ఒక సైడు ఉన్నారు, చంద్రబాబు మరోవైపు ఉన్నారు...ఇలా వాళ్ల ఇంట్లోనే 36 రకాలు ఉన్నారని.. మరీ అదెట్లా అని ప్రశ్నించారు. ఏ పార్టీలో ఎక్కడా రక్త సంబంధీకులు, అన్నదమ్ములు పోటీ చేసిన దాఖలాలు లేవు.. కేటీఆర్, కేటీఆర్ చెల్లెలు మనస్పర్థలు అనేది పెద్ద పాయింట్ కాదన్నారు. అలాగే ఇక్కడ ప్రజల్లో చీలిక అనేది లేదన్నారు.

అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎవరు వచ్చినా గెలుపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే అన్నారు. అధికార దుర్విని యోగం చేయకుండా, పోలీసులను ఉపయోగించకుండా, వ్యవస్థలను ఉపయోగించుకోకుండా ఎన్నికలు జరిపితే వాళ్లు ఓడిపోయినా గొప్పవారేనన్నారు. గెలుపోటములు సర్వసాధారణమని, ప్రజా స్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిపినా వాళ్ల గొప్పతనమే, బలహీనంగా ఎన్నికలు జరిగినా చెడ్డపేరు వాళ్లకే అన్నారు.

విశ్వవిద్యాలయమే మనకు ప్రధానం

– వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చి దేశ ప్రగతికి దోహదపడనున్న విశ్వవిద్యాలయ ప్రగతి మనకు ప్రధాన అజెండా అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన వివిధ విభాగాల డీన్లు, అన్ని విభాగాల అధిపతులతో తన చాంబర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘పీఎం ప్రొఫెసర్‌షిప్’కి ఎంపికైన స్పోక్ ఇనిస్ట్యూషన్‌లలో యోగి వేమన విశ్వవిద్యాలయం కూడా ఒకటని తెలిపారు. ఇక్కడి నుంచి ఒక ప్రొఫెసర్ ఎంపిక అవుతారని, వారి పరిశోధనకు రూ.30 లక్షల నిధులు ఇస్తారని వివరించారు. ఒక కమిటీ ద్వారా ప్రొఫెసర్ ని ఎంపిక చేస్తామన్నారు. విశ్వవిద్యాలయం పై, అధికారుల మీద అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరుతామన్నారు. విశ్వవిద్యాలయంలో వ్యక్తిగత ప్రయోజనాలు ఉండకూడదని సంస్థ ప్రయోజనాలే ముఖ్యంగా భావించాలన్నారు. పలు విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, వివిధ విభాగాల డీన్లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.


డీన్లు, విభాగాధిపతుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దాలి

కడప ఎడ్యుకేషన్: కేజీబీవీలోని విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటి ఈఓ రాజగోపాల్‌రెడ్డి సూచించారు. కడప నగర శివార్లలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో జీసీడీఓ దార్ల రూత్ ఆరోగ్యమేరీ అధ్యక్షతన జరుగుతున్న కేజీబీవీ సబ్జెక్టు టీచర్ల రెండవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అన్నారు. వారి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ముఖ్యంగా చదువులో వెనకబడిన వారిని ప్రోత్సహించి వారికి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థితికి తీసుకుని వచ్చేందుకు కృషి చేయాలన్నారు. డిప్యూటి డైరెక్టర్ దేవరాజు మాట్లాడుతూ కేజీబీవీలలో విద్యనభ్యసించే విద్యార్థులంతా ఆర్థికంగా వెనుకబడిన వారేనన్నారు. వారి విద్యాభివృద్ధికి కృషి చేయడంలో ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏఎంఓ వీరేంద్ర, ఏఎస్‌ఓ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటి ఈఓ రాజగోపాల్‌రెడ్డి

నాలుగు మండలాల్లో వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో నాలుగు మండలాల్లో వర్షాలు కురిసాయి. ఇందులో భాగంగా లింగాలలో 28.2 ఎంఎం, ఎర్రగుంట్లలో 4.6 ఎంఎం, జమ్మలమడుగులో 3.4 ఎంఎం, పెండ్లిమర్రిలో 1.4 ఎంఎం వర్షం కురిసింది.

బీరం కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న బీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల గుర్తింపు రద్దుచేయాలని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు కోరారు. సోమవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఖాజీపేట మండల పరిధిలో, అలాగే జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న ఈ కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఇంటర్మీడియేట్ బోర్డు ఆదేశాలను ధిక్కరిస్తూ ఐఐటీ, నీట్ కోచింగ్‌ను ఇస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి వివిధ రకాల ఫీజుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2.40 లక్షలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని తెలిపారు. కళాశాలలోనే పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటగోపి, శశాంక్, రిజ్వాన్ పాల్గొన్నారు.

ధర్మస్థల వివాదంపై విచారణ జరపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కర్ణాటక రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవస్థానం ధర్మస్థల వద్ద యువతీ యువకుల మృతదేహాలు తవ్వే కొద్దీ బయటపడుతున్న విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి కోఆర్డినేటర్ సత్తార్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మస్థల వివాదంపై పూర్తిస్థాయి విచారణ జరగాలని, వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాసిర్ ఖాన్, మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పోషక ఆహారాన్ని తీసుకోవాలి


మహిళలకు ఉచితంగా అందజేస్తున్న మునగ మొక్కలు

కడప అగ్రికల్చర్: పోషకాలు గల ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం సికెదిన్నె మండలం ఇప్పెంట ఎస్సీ కాలనీలో మహిళలకు పెరటితోట పెంపకంపై అవగాహన కల్పించి పెరటితోటకు కావాల్సిన విత్తనాలతోపాటు మొక్కలను ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన పెరటితోటలో మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన మెలకువలు, జాగ్రత్తల గురించి వివరించారు. పెరటి తోటలో పండించిన ఆకుకూరలు, కూరగాయలను తినటం వల్ల మంచి పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు ప్రశాంతి, మానస, ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం వసంతకుమారి, సిబ్బంది నీలకంఠ రెడ్డి, గంగిరెడ్డి, అన్నపూర్ణతో పాటు మాస్టర్ ట్రైనర్‌లు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యార్థుల పట్ల తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్య వైఖరి గా వ్యవహరిస్తున్న మునిసిపల్ హై స్కూల్ మెయిన్ ప్రధానోపాధ్యాయురాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ కడప నగర అధ్యక్షులు అకిరా నందన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు అభిరామ్, నిఖిల్, శివ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

కమలాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు దివ్యాంగులు, వయో వృద్ధులకు సహాయ పరికరాల పంపిణీ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కెజియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం, వల్లూరు మండలాలకు చెందిన దివ్యాంగులు, వయో వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు కావలసిన పరికరాలు పొందవచ్చన్నారు.

వీరు ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికెట్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకు రావాలని సూచించారు. చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ల చేతికర్రలు, చంక కర్రలు, వీల్‌ఛైర్లు, తోపుడు బండ్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, ట్రై సైకిల్స్, రోలేటర్స్ అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.